

ఉష్ణోగ్రత: గరిష్ఠం 35.0 కనిష్ఠం 23.0

యువ వికాసం.. యువతకు అవకాశం

మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు గడువు ఏప్రిల్ 14వ తేదీ వరకు ఉందని మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి పేర్కొన్నారు. ఆసక్తిగల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నాపరాళ్లను తరలిస్తున్న
లారీల పట్టివేత



కరన్‌కోట్ పోలీసుస్టేషన్ వద్ద పట్టుబడిన లారీలు

తాండూరురూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గౌతాపూర్-ఓగీపూర్ గ్రామాల మధ్య కరన్‌కోట్ పోలీసులు మంగళవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. ఓగీపూర్ నుంచి తాండూరు వెళ్తున్న నాపరాతి(చెక్కరాయి)ని తరలిస్తున్న నాలుగు లారీలకు ట్రాఫిక్ ఉల్లంఘన కింద లారీకి రూ.2 వేల చొప్పున రూ.8 వేలు జరిమానా విధించినట్లు కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపారు. ఇదే మార్గంలో ఓగీపూర్ నాపరాతి గనుల నుంచి బండలు తరలిస్తున్న మరో మూడు లారీలను తనిఖీలు చేయగా వాటికి రాయల్టీ పత్రాలు లేకపోవడంతో మైన్స్ అధికారులకు అప్పగించారు. ట్రాఫిక్ నిబంధనల మేరకు డ్రైవింగ్ లైసెన్స్‌లు లేకపోవడం, లారీలకు సంబంధించిన ఆర్సీ బుక్కులు, ఇన్సూరెన్స్ వంటివి లేకపోవడంతో లారీలను కరన్‌కోట్ పోలీసుస్టేషన్‌కు తరలించి జరిమానా విధించి కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. మైన్స్ అధికారులకు అప్పగించిన మూడు లారీలపై క్షేత్ర స్థాయిలో విచారిస్తారన్నారు.

తడబడ్డ తాండూరు..
టాప్‌లో వికారాబాద్

- ఆస్తి పన్ను వసూళ్లలో రెండు బల్దియాల తీరు 7
- 80 శాతం దాటిన పరిగి, కొడంగల్ మున్సిపాలిటీలు



కులకచర్ల మండలంలోని అనంతసాగర్ అడవి

విస్తరిస్తున్న అడవులు

రంగారెడ్డి, మేడ్చల్‌లో పెరిగిన భౌగోళిక ప్రాంతం

అడవుల విస్తీర్ణం పెంపొందించడానికి ప్రభుత్వం చేపడుతున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి. ప్రతీ సంవత్సరం మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతుండటంతో ఉమ్మడి జిల్లాలో అటవీ భూముల విస్తీర్ణం గడిచిన ఐదేళ్లలో గణనీయంగా పెరిగింది. అయితే వికారాబాద్ జిల్లా పరిధిలో మాత్రం స్వల్ప తగ్గుదల నమోదైంది. తాజాగా ప్రభుత్వం విడుదల చేసిన సామాజిక ఆర్థిక సర్వే-2025లో రాష్ట్రంలోని అటవీ భూముల వివరాలను వెల్లడించారు. ఈ సర్వే ఆధారంగా గత ఐదేళ్లలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలో అటవీ విస్తీర్ణం మెరుగైంది. జిల్లాల వారీగా చూస్తే మేడ్చల్, రంగారెడ్డి జిల్లాలో అటవీ విస్తీర్ణం గణనీయంగా పెరగగా వికారాబాద్ జిల్లాలో స్వల్పంగా తగ్గడం గమనార్హం.

వికారాబాద్‌లో స్వల్ప తగ్గుదల
రాష్ట్రంలో మేడ్చల్ జిల్లాకు 11వ స్థానం
కంపా నిధులు పూర్తిగా వినియోగిస్తే మరిన్ని ఫలితాలు
అడవుల ఆక్రమణలు అడ్డుకోకుంటే ప్రమాదమే

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి) : కొన్ని సంవత్సరాలుగా అటవీ ప్రాంతాల్లో వనమహోత్సవాలను నిర్వహించి విస్తృతంగా మొక్కలు నాటడం కారణంగా అటవీ సంపద పెరుగుతోందని తాజాగా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన సామాజిక ఆర్థిక సర్వే లో వెల్లడైంది. అటవీ విస్తీర్ణంలో మేడ్చల్ జిల్లా 11వ స్థానంలో ఉండగా, రంగారెడ్డి జిల్లా 18వ స్థానం, వికారాబాద్ జిల్లా 19వ స్థానంలో ఉంది. 2018-19లో రంగారెడ్డి జిల్లాలో అటవీ భూముల విస్తీర్ణం 5.87శాతం ఉండగా 2024-25 నాటికి 13.91శాతానికి పెరిగింది. అలాగే మేడ్చల్ జిల్లాలో అయిదేళ్ల కిందట 7.71శాతం ఉండగా ప్రస్తుతం 13.91శాతానికి పెరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయి. అలాగే వికారాబాద్ జిల్లాలో ఐదేళ్ల కిందట 13.15శాతం ఉన్న

మిగతా 7వ పేజీలో...



దౌల్తాబాద్ మండలం గుండెపల్లి అటవీ ప్రాంతం

గడిచిన ఐదేళ్లలో అటవీ భూముల విస్తీర్ణం (శాతంలో..)

జిల్లా	2018-19	2024-25
మేడ్చల్	7.71	22.93
రంగారెడ్డి	5.87	13.91
వికారాబాద్	13.15	12.15



రైల్వే స్టేషన్‌లో తనిఖీ చేస్తున్న డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, సిబ్బంది

రైల్వే స్టేషన్‌లో విస్తృత తనిఖీలు

తాండూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): గంజాయి, ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా జరుగుతుందని వచ్చిన సమాచారంతో తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్‌లో విస్తృత తనిఖీలు చేపట్టారు. మంగళవారం డీఎస్పీ సిబ్బందితో కలిసి ఎల్‌టీటీ ట్రైన్‌ను తనిఖీ చేశారు. అక్రమ రవాణాను అరికట్టడంలో భాగంగా రైల్వే స్టేషన్‌లో తనిఖీ చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీలో ఎలాంటి అక్రమ రవాణాకు సంబంధించి పదార్థాలు దొరకలేవని పేర్కొన్నారు.



ఘట్‌కేసర్‌లో స్వీట్లు తినిపించుకుంటున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఎస్సీ వర్గీకరణ ఉద్యమాన్ని విస్తృతం చేయాలి

- ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి

ఘట్‌కేసర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మందకృష్ణ మాదిగ ఎస్సీ వర్గీకరణ ఉద్యమాన్ని దేశవ్యాప్తం చేయాలని, ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాల్లోనూ ఉద్యమం చేపట్టాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి అన్నారు. మంగళవారం ఘట్‌కేసర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కన్వీనర్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి మండలికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మాదిగలకు తొమ్మిది శాతం రిజర్వేషన్ కల్పించడం అభినందనీయమన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మాదిగలకు అన్యాయం జరిగిందని, దీనికి మందకృష్ణ కారణమని ఆరోపించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో వర్గీకరణ ఉద్యమాన్ని ఉధృతం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నర్సింగరావు, మల్లేష్, సురేష్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.



ఖర్గేకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యేలు

చాన్స్ ప్లీజ్..!

మంత్రివర్గ విస్తరణలో అవకాశం కల్పించాలని విన్నపం

అధిష్ఠానంపై ఒత్తిడి పెంచిన ఎమ్మెల్యేలు.. జానారెడ్డి లేఖతో మారిన పరిణామాలు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)/తాండూరు ఏప్రిల్ 1: మంత్రివర్గంలో స్థానం కోసం ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు అధిష్ఠానంపై ఒత్తిడిపెంచుతున్నారు. త్వరలో రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ జరగనున్న నేపథ్యంలో ఉమ్మడి రంగారెడ్డిజిల్లాకు కూడా ప్రాతినిధ్యం కల్పించాలని ఎమ్మెల్యేలు ముక్తకంఠంతో కోరుతున్న విషయం తెలిసిందే. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి ఒక్కరికి కూడా మంత్రివర్గంలో స్థానం లేకపోవడంతో ఈ సారి జరిగే మంత్రివర్గవిస్తరణలో అవకాశం కల్పించాలని ఎమ్మెల్యేలు కోరుతున్నారు. మంత్రివర్గంలో బెర్త్ కోసం గతంలో వేర్వేరుగా ప్రయత్నించిన ఎమ్మెల్యేలు చివరకు ఒకతాటిపైకి వచ్చారు. తమలో ఒకరికి అవకాశం కల్పించాలని అందరూ కలిసి గట్టిగా కోరుతున్నారు. తమలో ఎవరికి అవకాశం కల్పించిన అభ్యంతరం లేదని అందరూ కలిసి అధిష్ఠానం పెద్దలను కలిసి లేఖ అందించారు. ఈ లేఖలో స్పీకర్ ప్రసాద్‌కుమార్ సంతకం కూడా ఉన్నట్లు తెలిసింది. ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, మనోహర్ రెడ్డి, యాదయ్య మంగళవారం ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, ఏఐసీసీ జనరల్

మిగతా 7వ పేజీలో...



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి

గ్రామాల అభివృద్ధికి
ప్రభుత్వం చర్యలు

బొంరాస్‌పేట్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): గ్రామాలు, తండాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం బొంరాస్‌పేట్‌లో కాంగ్రెస్ నాయకులతో కలిసి రూ.20లక్షల డీఎంఎఫ్‌టీ నిధులు, రూ.40లక్షల సీఆర్ఆర్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో కొడంగల్ నియోజకవర్గంలోని గ్రామాలు, తండాలు అభివృద్ధి పథంలో దూసుకువెళ్తున్నాయన్నారు. కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ జయకృష్ణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సిములుగౌడ్, రాంచంద్రారెడ్డి, వెంకట్రాములుగౌడ్, నర్సిములునాయుడు, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

పేదల కంచంలో
సన్నన్నం

ప్రారంభమైన సన్న బియ్యం పంపిణీ
రేషన్ అక్రమ రవాణాకు చెక్!
హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు
ఢిల్లీ పర్యటనలో పరిగి, తాండూరు, చేవెళ్ల ఎమ్మెల్యేలు
వారు వచ్చిన తర్వాత ఆయా నియోజకవర్గాల్లో ప్రారంభం

వికారాబాద్/మేడ్చల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పేదల కంచాల్లోకి సన్నన్నం వచ్చి చేరింది. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఉగాదిన హుజూర్‌నగర్ నియోజకవర్గంలో సీఎం రేవంత్‌రెడ్డి రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీని ప్రారంభించగా మంగళవారం వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో సన్న బియ్యం పంపిణీ షురూ అయ్యింది.

వికారాబాద్ జిల్లాలో..

జిల్లాలో 588 రేషన్ దుకాణాలుండగా, మొత్తం 2,63,573 రేషన్ కార్డులు, 8,52,551 మంది సభ్యులు ఉన్నారు. వీరికి ప్రతి నెలా 5,300 మెట్రిక్ టన్నుల బియ్యం అవసరం అవుతాయి. ఆహార భద్రత కార్డులు 2,36,881, అంత్యోదయ అన్నయోజన 26,656, అన్నపూర్ణ 36 కార్డులున్నాయి. ఇప్పటికే 4,700 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని అన్ని రేషన్ దుకాణాలకు చేర్చారు. ఆహార భద్రతా కార్డుల్లో నమోదైన ఒక్కొక్కరికీ 6 కిలోల వంతున పంపిణీ చేస్తారు. అంత్యోదయ కార్డుకు 35 కిలోలు, అన్నపూర్ణ అన్నయోజన కార్డుకు 10 కిలోలు అందజేస్తారు.

సన్న బియ్యంతో అక్రమ రవాణాకు అడ్డుకట్ట

సన్న బియ్యం పంపిణీతో రేషన్ బియ్యం అక్రమ రవాణాకు చెక్ పడనుంది. ఇంతకాలం లబ్ధిదారుల్లో చాలామంది దొడ్డు బియ్యం తినక అమ్ముకున్నారు. ఆ బియ్యంతో కొందరు

మిగతా 8వ పేజీలో...



సన్న బియ్యం పంపిణీ చేస్తున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

మేడ్చల్‌లో షురూ

మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలోని రేషన్ షాపుల్లో మంగళవారం లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ ప్రారంభమైంది. అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డీఎస్ఓ సుగుణబాయి జిల్లాలోని పలు రేషన్ దుకాణాలను పరిశీలించి సన్న బియ్యం పంపిణీపై ప్రజలకు అవగాహన కల్పించారు. సన్న బియ్యం సరఫరాకు సంబంధించి కార్డుదారులతో మాట్లాడారు. అనంతరం పలు ఎమ్ఎల్ఎస్ పాయింట్లను సందర్శించి నిర్ణీత సమయంలో స్టేజ్ 2 కదలికను వేగవంతం చేయాలని ఇన్‌చార్జిలను ఆదేశించారు. అసిస్టెంట్ డీఎస్ఓ సంధ్య తదితరులు పాల్గొన్నారు.



సూర్యనారాయణ మూర్తిగా
వేంకటేశ్వరుడు

కొడంగల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పేదల తిరుపతిగా పేరొందిన కొడంగల్ శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా 7వ రోజు మంగళవారం శ్రీ వేంకటేశ్వరస్వామి భక్తులకు సూర్యనారాయణ మూర్తిగా దర్శనం ఇచ్చారు. అనంతరం సహస్ర కిరణాలతో ప్రకాశించే దివ్యమైన సూర్యప్రభ వాహనంపై మాడవీధుల్లో ఊరేగించారు. ఉత్సవాలకు భక్తులు పెద్ద ఎత్తున హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, పురోహితులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ @ రూ.211 కోట్లు





రాష్ట్రంలోనే టాప్‌లో నిలిచిన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా!

వచ్చిన దరఖాస్తులు లక్షా 65 వేలు.. క్రమబద్ధీకరించుకున్నది 28 వేల మంది



మేడ్చల్ ప్రతినిధి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): అక్రమ లేఔట్ల క్రమబద్ధీకరణ(ఎల్ఆర్ఎస్) ద్వారా మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాకు పెద్ద ఎత్తున ఆదాయం లభించింది. మార్చి 31వ తేదీ లోపు స్థలాలను క్రమబద్ధీకరించుకుంటే ప్రభుత్వం 25 శాతం రాయితీ అవకాశం ఇచ్చిన విషయం తెలిసిందే. దీనిపై అధికారులు విస్తృత ప్రచారం చేపట్టారు. ప్రభుత్వం ఇచ్చిన రాయితీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు స్థలాల యజమానులకు స్వయంగా ఫోన్ చేసి తెలియజేశారు. అలాగే జిల్లాలోని మున్సిపాల్టీలు, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఆటోల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఎల్ఆర్ఎస్‌పై ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని ఎక్కువగా మేడ్చల్, రంగారెడ్డి జిల్లాలోనే

మిగతా 8వ పేజీలో...



మాట్లాడుతున్న అర్చక సంఘం జిల్లా అధ్యక్షుడు లోకూర్తి జయతీర్థచారి

అర్చకులు ఆధ్యాత్మికతను పెంపొందించాలి

- డీడీఎంఎస్ జిల్లా అధ్యక్షుడు లోకూర్తి జయతీర్థచారి

దోమ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఆలయ అర్చకులు ఆధ్యాత్మికతను పెంపొందించేందుకు కృషి చేయాలని దూప దీప నైవేద్య అర్చక సంఘం వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు లోకూర్తి జయతీర్థచారి కోరారు. మంగళవారం మండలంలోని మోత్కూర్ గ్రామంలో డీడీఎన్ఎస్ ప్రధాన కార్యదర్శి కరణం శ్రీకాంత్ నివాసంలో జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్చకులు ఆలయాల్లో శుచి, శుభ్రత పాటిస్తూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. అర్చకులు ఒకరికొకరు సహాయ సహకారాలు అందించుకుంటూ సంఘటితంగా ఎదిగేందుకు పాటుపడాలన్నారు. దూప దీప నైవేద్య అర్చక సంఘంలో సభ్యత్వ నమోదుకు కార్యవర్గ సభ్యులు సన్నద్ధం కావాలని సూచించారు. సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు కల్యాణ్ రామ్, ప్రధాన కార్యదర్శి కరణం శ్రీకాంత్, సభ్యులు నటరాజ్, జగదీశ్, రాజశేఖర్, వీ.శ్రీకాంత్‌చారి, సత్యనారాయణ రావు పాల్గొన్నారు.

నెలలుగా జీతాలివ్వకపోవడం అన్యాయం

శామీర్‌పేట, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వకుండా పని చేయించుకోవడం అన్యాయం అని, ఏం తిని బతకాలని కార్మికులు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జీతాలివ్వకపోవడాన్ని నిరసిస్తూ మంగళవారం మండలంలోని లాల్‌గడీ మలక్‌పేట పంచాయతీ కార్మికులు కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఈ



లాల్‌గడీ మలక్‌పేట పంచాయతీ వద్ద ఆందళన చేస్తున్న కార్మికులు

సందర్భంగా వారు మాట్లాడుతూ.. పంచాయతీ అధికారులు నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదన్నారు. కుటుంబ పోషణకు అప్పు చేస్తున్నామని, ఇకపై అప్పు కూడా పుట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా అధికారులు జీతాలు చెల్లించకుంటే జిల్లా స్థాయిలో ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేపడతామని కార్మికులు హెచ్చరించారు.

లారీ వరి గడ్డి రూ.38వేలు!



యాచారం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): నల్గొండ జిల్లా పెద్దవూర ప్రాంతానికి చెందిన వ్యాపారులు వరి గడ్డి తెచ్చి అమ్ముతున్నారు. లారీ గడ్డి మోపుల లోడ్‌ను రూ.38వేలకు విక్రయించారు. హాలియా, పెద్దవూర ప్రాంతాల నుంచి తెచ్చిన ఎండు గడ్డిని స్థానిక రైతులు కొంటున్నారు. ఎండకాలంలో పశువులకు మేత లేక అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నామని చెబుతున్నారు.

గ్రూప్-1 ర్యాంకర్‌కు సన్మానం



కావటి మల్లేశ్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

ఆమనగల్లు, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): ఇటీవల తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ విడుదల చేసిన గ్రూప్-1 ఫలితాల్లో రాష్ట్రస్థాయి 187వ ర్యాంక్, మల్టీజోన్‌లో 92వ ర్యాంక్ సాధించిన ఆమనగల్లు గుర్రంగుట్ట కాలనీకి చెందిన కావటి మల్లేశ్‌యాదవ్‌కు మంగళవారం బీజేపీ నాయకులు అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. మల్లేశ్, అతడి తల్లిదండ్రులు యాదయ్య, పార్వతమ్మలను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. పట్టుదలతో చదివి రాష్ట్రస్థాయి ర్యాంక్ సాధించడం గొప్ప విషయమని బీజేపీ నాయకులు అన్నారు. ఇప్పటికే మూడు ప్రభుత్వ ఉద్యోగాలకు మల్లేశ్ ఎంపికయ్యారని తెలిపారు. ప్రతిభతోనే గుర్తింపు వస్తుందని తెలిపారు. మల్లేశ్ అంకితభావంతో విధులు నిర్వర్తించి ప్రజల మన్ననలు పొందాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు కె.విక్రమ్‌రెడ్డి, పార్లమెంటరీ పార్టీ జిల్లా కౌన్సిల్ మెంబర్ లక్ష్మణ్, బైకని శ్రీశైలం, రవి, టి.మల్లేశ్, ఆనంద్, వెంకటేశ్, టిల్లు, గిరియాదవ్, దుడ్డు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన మాట ప్రకారం సన్నబియ్యం పంపిణీ



సన్న బియ్యం పంపిణీ చేస్తున్న హరివర్ధన్‌రెడ్డి, నాయకులు

మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ నిరుపేద కుటుంబాలకు ఇచ్చిన హామీ మేరకు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిందని డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మేడ్చల్, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీల్లో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. రేషన్ షాపుల్లో పేదకు బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తోందన్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పులను తీరుస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడుపుతున్నారన్నారు. సన్న బియ్యం పంపిణీతో పాటు రైతుల నుంచి సన్నధాన్యం కని బియ్యాన్ని విదేశాలకు ఎగుమతి చేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అన్నారు. కార్యక్రమంలో మేడ్చల్ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ దీపికనర్సింహారెడ్డి, నాయకులు వి.శ్రీనివాస్‌రెడ్డి, రమణారెడ్డి, సురేందర్, మర్రి నర్సింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన బార్ నూతన కార్యవర్గం

చేవెళ్ల, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి):చేవెళ్లలోని కోర్టు హాల్‌లో మంగళవారం చేవెళ్ల బార్ అసోషియేషన్ నూతన కార్యవర్గం బాధ్యతలు చేపట్టింది. అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మహేశ్‌గౌడ్, ఉపాధ్యక్షులు కృష్ణగౌడ్, నర్సింలు, జాయింట్ సెక్రటరీ యాదగిరిగౌడ్, కోశాధికారి రవీందర్‌రెడ్డి, లైబ్రేరియన్ మల్లేశం, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ ప్రభాకర్‌రెడ్డి, లేడీ రిప్రజెంటేటివ్ గీతావనజాక్షి, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా రవీందర్, ప్రకాశం, ప్రదీప్‌రెడ్డి, యాదయ్య, శివరాజ్‌గౌడ్ బాధ్యతలు తీసుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు రవిశంకర్‌గౌడ్, పాండురంగారెడ్డి పాల్గొన్నారు.



బార్ అసోషియేషన్ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



నూతన కమిటీని అభినందిస్తున్న నాయకులు

మహేశ్వరం, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికులకు సామాజిక భద్రత వెల్ఫేర్ బోర్డు వర్తింపజేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రామ్మోహన్‌రావు పిలుపునిచ్చారు. మంగళవారం అమీర్‌పేటలో సీఐటీయూ మండల అధ్యక్షుడు శేఖర్ ఆధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి హాజరై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత అసంఘటిత రంగ కార్మికుల సమస్యలు పెరుగిపోతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. సంక్షేమ పథకాలను భవన నిర్మాణ కార్మికులు వినియోగించుకోవడం లేదన్నారు. 60సంవత్సరాలు నిండిన కార్మికులకు పెన్షన్, పిల్లల చదువులకు స్కాలర్‌షిప్‌లు, గృహవసతి, అడ్డాల్లో వసతులు కల్పించాలన్నారు. ఇదే సందర్భంగా సీఐటీయూ మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా యాదయ్య, ప్రధాన కార్యదర్శి శేఖర్, కోశాధికారి యాదయ్య, ఉపాధ్యక్షుడిగా దావీద్ ఎన్నికయ్యారు. చంద్రయ్య, నర్సింహ, రమేష్, కార్మికులు పాల్గొన్నారు.

బీసీ గర్జనకు తరలిన లాల్‌కృష్ణప్రసాద్

పరిగి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో బుధవారం చేపట్టిన బీసీ పోరు గర్జనకు రాష్ట్రం నుంచి అన్ని పార్టీల బీసీ నాయకులకు తరలివెళ్లారు. పరిగికి చెందిన బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ ఎం.లాల్‌కృష్ణప్రసాద్.. పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్‌లతో కలిసి విమానంలో ఢిల్లీ వెళ్లారు. పోరు గర్జనతో బీసీల సత్తా చాటుతామని చెప్పారు.



పీసీసీ చీఫ్‌తో లాల్‌కృష్ణప్రసాద్

విస్తరిస్తున్న అడవులు

(ఐదో పేజీ తరువాయి)

అటవీ విస్తీర్ణం 12.15శాతానికి తగ్గింది. కేంద్ర అటవీ నిర్వహణ, ప్రణాళిక సంస్థ (కంపా) ఇచ్చే నిధులు రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలతో పోలిస్తే కొంత ఎక్కువగా ఖర్చు పెట్టినప్పటికీ ఫలితాలు రాలేదు. అలాగే అటవీ భూముల్లో మొక్కలు నాటే కార్యక్రమాలు కూడా ఆశించిన స్థాయిలో జరగడం లేదు. అయితే గతంలో కంటే కొంత మెరుగ్గానే మొక్కలు నాటే కార్యక్రమాలు జరగడంతో మంచి ఫలితాలు వస్తున్నాయి.

'కంపా' నిధులపై నిర్లక్ష్యమేల?

అటవీ విస్తీర్ణం పెంచేందుకు కేంద్రం ఇచ్చే నిధులు గత పదేళ్లలో అంతంత మాత్రమే ఖర్చుచేశారు. వీటిని కూడా పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుంటే మరింత ఫలితాలు వచ్చేవి. గడిచిన పదేళ్లలో అటవీ నిర్వహణ, ప్రణాళిక సంస్థ (కంపా) ద్వారా రాష్ట్రంలో దాదాపు మూడువేల కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసినప్పటికీ వీటిని సక్రమంగా వినియోగించలేదు. నిధులు పుష్కలంగా అందుబాటులో ఉన్నప్పటికీ అడవుల పెంపకంపై అధికార యంత్రాంగం సరైన శ్రద్ధ తీసుకోలేదు. దీంతో ఈ నిధులు నిరుపయోగంగా మారాయి. అడవుల పెంపకం కోసం ఏర్పాటు చేసిన ఈ నిధిని వినియోగించడంలో రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ జిల్లాలు కూడా విఫలమయ్యాయి. మేడ్చల్ జిల్లాలో పదేళ్లలో కంపా నిధులు 62.67 శాతమే ఖర్చుచేశారు. అలాగే రంగారెడ్డిజిల్లా 64.41శాతం నిధులు ఖర్చుపెట్టారు. ఇక వికారాబాద్ జిల్లాలో కొంత మెరుగ్గా 73.22 శాతం నిధులు వరకు ఖర్చు చేశారు.




అటవీ భూముల అన్యాక్రాంతం

ఇదిలా ఉంటే పట్టణ ప్రాంతాలు శరవేగంగా విస్తరించడంతో నగర శివార్లలోని అటవీ భూములు కూడా అన్యాక్రాంతమవుతున్నాయి. గడిచిన మూడు దశాబ్దాల కాలంలో అటవీ భూములు పెద్ద ఎత్తున ఆక్రమణలకు గురయ్యాయి. ఇటీవలే కొంగర కలాన్‌లో 72 ఎకరాల అటవీ భూముల డీనోటిఫై చేసి పట్టాలు పంపిణీ చేసిన వ్యవహారంపై హైకోర్టు సీరియస్ అయ్యింది. దీనిపై తదుపరి ఎలాంటి లావాదేవీలు, నిర్ణయాలు తీసుకోరాదని ఆదేశించింది. అలాగే గడిచిన కొన్నేళ్లుగా వందలాది ఎకరాల అటవీ భూములు అన్యాక్రాంతమయ్యాయి. ఒక్క వికారాబాద్ జిల్లాలో 15600 ఎకరాల అటవీ భూములు ఆక్రమణలకు గురైనట్లు 2022లో గుర్తించారు. వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్, ధారూర్, దామగుండం, మర్పల్లి, కండ్లపల్లి, గట్‌కొండాపూర్, నాగారం, తిర్మలాపూర్, నజీరాబాద్, మహ్మదాబాద్, ఫైల్వార్, అడికచర్ల ప్రాంతాల్లో అన్యాక్రాంతమయ్యాయి. ఇందులో వికారాబాద్, కొడంగల్ రేంజ్‌లలోనే దాదాపు 6వేల ఎకరాలు ఆక్రమణలకు గురయ్యాయి. ఇందులో కొన్ని భూములను అటవీ శాఖ వెనక్కితీసుకున్నప్పటికీ మరికొన్ని వివాదాల్లో ఉన్నాయి.

తడబడ్డ తాండూరు.. టాప్‌లో వికారాబాద్

ఆస్తి పన్ను వసూళ్లలో రెండు బల్దియాల తీరు

- 80 శాతం దాటిన పరిగి, కొడంగల్ మున్సిపాలిటీలు
- 47 శాతానికే పరిమితమైన తాండూరు బల్దియా
- రాష్ట్రంలోనే 8వ స్థానంలో నిలిచిన వికారాబాద్



తాండూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఆస్తి పన్ను వసూళ్లలో (2024-25 ఆర్థిక సంవత్సరం) వికారాబాద్ మున్సిపాలిటీ టాప్‌లో నిలిచి రాష్ట్రంలో 8వ స్థానాన్ని దక్కించుకుంది. తాండూరు 47 శాతంతోనే సరిపెట్టుకొని 128వ స్థానంలోకి వెళ్లింది. పరిగి, కొడంగల్ మున్సిపాలిటీలు 80శాతం లక్ష్యాన్ని దాటి మెరుగైన స్థానాన్ని సాధించాయి. మార్చి 31 అర్ధరాత్రి వరకు ఆస్తి పన్ను వసూళ్లను చేపట్టారు. ఎప్పుడూ ముందంజలో ఉండే తాండూరు బల్దియా ఈ ఏడాది పూర్తిగా వెనుకబడిపోయింది. అది కూడా ప్రత్యేకాధికారి పాలనలో వెనుకబడి ఉండటం విశేషం.

గ్రోత్ రేటు కూడా సాధించని తాండూరు

జీఎస్‌జీపీ (గ్రోత్) రేటు సాధించడంలో తాండూరు మున్సిపాలిటీ విఫలమైంది. రాష్ట్ర స్థూల నికర ఆదాయం 12.09 సాధించాల్సి ఉంది. జిల్లాలో వికారాబాద్, పరిగి, కొడంగల్ మున్సిపాలిటీలు ఆర్థిక సంవత్సరం ముగింపు (మార్చి 31) నాటికి జీఎస్‌జీపీ(గ్రోత్) రేటును సాధించాయి. గ్రోత్ రేటు సాధించాలంటే తాండూరు మున్సిపాలిటీ ఇంకా రూ.44 లక్షలు ఆస్తి పన్ను వసూళ్లు చేయాల్సి ఉంది. గ్రోత్ రేటును చేరకపోవడంతో జనాభా ప్రాతిపదికన అందించే 15వ ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోనున్నాయి.

పన్ను వసూలులో నిర్లక్ష్యం

ఆస్తి పన్ను వసూళ్లలో తాండూరు మున్సిపాలిటీ కమిషనర్‌తో సహా రెవెన్యూ విభాగం నిర్లక్ష్యం వహించింది. అతి పెద్ద మున్సిపాలిటీగా పేరున్న తాండూరు ఆస్తి పన్ను వసూళ్లలో వెనుకబడుతున్న విషయాన్ని గమనించి అనేకసార్లు సీడీఎంతో సహా పలువురు ఉన్నతాధికారులు టెలీ కాన్ఫరెన్స్‌లో కమిషనర్‌ను హెచ్చరించారు. అయినా ఆస్తి పన్ను వసూళ్లు 50 శాతం కూడా దాటక పోవడం విశేషం. దీంతో అధికారులపై చర్యలు ఉండే అవకాశం ఉంది. ఇంక్రిమెంట్‌లు కట్ చేస్తామని గతంలోనే మున్సిపల్ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస్ కమిషనర్‌ను బిల్ కలెక్టర్లను హెచ్చరించారు. పలుమార్లు ఉన్నతాధికారులు తాండూరు మున్సిపాలిటీకి వచ్చి ఆస్తి పన్ను వసూలు విషయంలో సమీక్షలు నిర్వహించారు. అయినా అధికారుల్లో ఎలాంటి మార్పు రాలేదు. మున్సిపల్ కమిషనర్ విక్రం సింహారెడ్డి ప్రజాప్రతినిధుల అండ చూసుకొని తనపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకుండా ఇప్పటినుంచే పైరవీలు చేస్తున్నట్టు సమాచారం. గతంలో ఈ అధికారిపై ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటుకు సిద్ధమైతే మెదక్ జిల్లాకు చెందిన మంత్రి ద్వారా తన పలుకుబడిని ఉపయోగించుకొని సస్పెన్షన్ వేటు పడకుండా జాగ్రత్త పడ్డట్టు వినికిడి.

2024-25 ఆర్థిక సంవత్సరంలో ఆస్తి పన్ను వసూళ్ల వివరాలు

మున్సిపాలిటీ	ఇళ్లు	డిమాండ్ (రూ.కోట్లలో)	వసూలు (రూ.కోట్లలో)	శాతం	రాష్ట్రంలో స్థానం
వికారాబాద్	15,115	4.34	3.86	88.94	8
పరిగి	5,185	2.34	1.94	82.91	27
కొడంగల్	4,084	1.63	1.35	82.82	29
తాండూరు	1,14,372	9.03	4.26	47.18	128



టీ స్టాల్‌లో గొడవపడుతున్న యువకులు

చాయ్ అడ్డాలో హంగామా!

- రెండు గ్రూపుల మధ్య ఘర్షణ
- పోలీసులకు ఫిర్యాదు
- ఆలస్యంగా వెలుగులోకి ఘటన



పరిగి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): పరిగిలోని ఓ టీస్టాల్ వద్ద రెండు వర్గాల యువకులు హంగామా సృష్టించారు. మద్యం మత్తులో పరస్పరం దాడి చేసుకున్నారు. ఆదివారం రాత్రి జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకొచ్చింది. యువకుల దాడి వీడియో సోషల్ మీడియాలో వైరలైంది. వేర్వేరు పార్టీల మద్దతున్న యువకులు మొదట తుంకులగడ్డలో ఓ విషయంలో గొడవపడ్డారు. అనంతరం ఓ గ్రూపు యువకులు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఉన్న చాయ్ అడ్డాకు వచ్చారు. మరో గ్రూప్ యువకులూ అక్కడికి చేరుకున్నారు. దీంతో రెండు వర్గాల వారు మరోసారి ఘర్షణపడ్డారు. కూల్‌డ్రింక్ బాటిళ్లు, ఇతర సామాగ్రితో కొట్టుకున్నారు. పోలీసులు చేరుకొని వారిని చెదరగొట్టారు. సామగ్రి ధ్వంసంతో టీస్టాల్ యజమానికి తీవ్ర ఆస్తినష్టం జరిగింది. ఇరు వర్గాల వారు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గంజాయి మత్తులో దాడి చేశారని పరస్పరం ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు ఒక వర్గాన్ని పిలిపించి తీవ్రంగా కొట్టారని కొందరు ఆరోపించారు. ఇంత జరిగినా పోలీసులు పట్టించుకోకుంటే శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందని పట్టణవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చాయ్ విల్లాల్లో మత్తు పదార్థాల సేవనంతోనే ఘర్షణలు జరుగుతున్నాయనే అభిప్రాయాలూ వ్యక్తమవుతున్నాయి.



స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న నాయకులు

బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం



చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న నాయకులు

షాబాద్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): భక్తుల కోరికలు తీర్చే కొంగు బంగారం కొమరబండ బుగ్గరామేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు రావాలని స్పీకర్ ప్రసాద్‌కుమార్, రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డిలకు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ చేవెళ్ల వెంకటయ్య, వైస్‌ఛైర్మన్ మాధవరెడ్డి, సభ్యులు సత్యనారాయణ, కాంగ్రెస్ అధ్యక్షుడు సుభాష్‌చంద్రబోస్ ఉన్నారు.



పార్లమెంట్‌ను సందర్శించిన బీజేపీ నాయకులు

మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ జిల్లాకు చెందిన పలువురు బీజేపీ నాయకులు మంగళవారం ఢిల్లీలోని పార్లమెంట్ భవనాన్ని సందర్శించారు. మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ కల్పించిన సౌకర్యార్థం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్లు దొడ్ల మల్లికార్జున్, వెంకటేష్, లక్ష్మణ్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, వి.సుదర్శన్, దొంతిరెడ్డిలు పార్లమెంట్‌ను సందర్శించారు.



రామాలయంలో హోమం నిర్వహిస్తున్న భక్తులు

ఘనంగా ఆలయ పునఃప్రతిష్ఠ వార్షికోత్సవం

కీసర, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): కీసరలోని సీతారామచంద్రస్వామి ఆలయ పునఃప్రతిష్ఠ తృతీయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మంగళవారం జరిగిన ఈ ఉత్సవంలో ఉదయం గర్భాలయంలోని మూల విరాట్లను పంచామృతాలతో అభిషేకించారు. అనంతరం ఆలయ ఆవరణలో హోమం నిర్వహించారు. మూడో వార్షికోత్సవం సందర్భంగా భక్తులు అధిక సంఖ్యల్లో విచ్చేసి పూజలు నిర్వహించి, హోమంలో పాల్గొన్నారు. ముగింపు ఉత్సవంలో భాగంగా పూర్ణాహూతి నిర్వహించి, ప్రసాద వితరణ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ నాయకపు వెంకటేష్, మేడ్చల్ జిల్లా ఆర్యవైశ్య మహాసంఘం అధ్యక్షుడు బెలిదె రమేష్‌గుప్తా, మాజీ సర్పంచ్ నాయకపు మాధురి, అర్చకుడు ప్రభాకర్ శర్మ, స్థానికులు పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్, నాయకులు

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

నందిగామ, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మంచినీటి దానం మహా గొప్పదని, మనిషి దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ప్రారంభించడం సేవాదృక్పథమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం నందిగామలో మాజీ ఎంపీటీసీ కొమ్ము కృష్ణ ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్సై గోపాలక్రిష్ణ, నాయకలు జిల్లెల్ల రాంరెడ్డి, మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, చంద్రపాల్‌రెడ్డి, దేపల్లి కుమార్‌గౌడ్, కావలి కృష్ణ, నర్సింలు, పిట్టల రాములు పాల్గొన్నారు.

వడదెబ్బ సోకకుండా జాగ్రత్తలు పాటించాలి



వడదెబ్బ లక్షణాలు వివరిస్తున్న వైద్యురాలు సుజల

మోమిన్‌పేట్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): వేసవి ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో ప్రజలు వడదెబ్బకు గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని మోమిన్‌పేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు సుజల అన్నారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ.. శరీరం అధిక వేడిని తట్టుకోలేనప్పుడు వడదెబ్బకు గురవుతారని తెలిపారు. సన్‌స్ట్రోక్ సోకితే శరీర ఉష్ణోగ్రతతో పాటు వారి మనిషి ప్రవర్తనలో మార్పు కనిపిస్తుందన్నారు. హృదయ స్పందన వేగంగా ఉండటం, శ్వాసఎక్కువ లేదా తక్కువగా ఉండటం, చెమట రాకపోవడం, చిరాకు లేదా కంగారుగా, అపస్మారక స్థితికి వెళ్లడం జరుగుతాయన్నారు. అలాగే తలపోటు, నాలుక తడారడం, వృద్ధుల్లో స్పృహ కోల్పోవడం వంటి వడదెబ్బ లక్షణాలు వడదెబ్బతో కలుగుతాయన్నారు. వడదెబ్బ తగలకుండా ప్రజలు బయటకు వెళ్లే సమమయంలో ఎక్కువగా నీరు, పానీయాలు తీసుకోవాలన్నారు. శరీర ఉష్ణోగ్రత మామూలు స్థితిలో ఉండేలా చూసుకోవాలన్నారు. సాధ్యమైనంత మేరకు ఎండలో తిరగొద్దని, అనారోగ్య సమస్యలేమైనా తలెత్తితే వెంటనే వైద్యులను సంప్రదించాలని ఆమె సూచించారు.

చాన్స్ ప్లీజ్..!

(ఐదో పేజీ తరువాయి)

సెక్రటరీ కేసీ వేణుగోపాల్‌ను కలిసి లేఖ అందజేశారు. వచ్చేస్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఉమ్మడిజిల్లాలో ఒకరికైనా మంత్రివర్గంలో అవకాశం కల్పించాలని వారు కోరారు. లేదంటే స్థానిక ఎన్నికల ఫలితాలపై ప్రభావం పడుతుందని గట్టిగానే చెప్పారు. ఇక ఇదే సమయంలో పార్టీ సీనియర్ నేత జానారెడ్డి మంత్రివర్గ విస్తరణలో హైదరాబాద్, రంగారెడ్డిజిల్లాలకు ప్రాతినిధ్యం కల్పించాలని కోరుతూ ఏఐసీసీ అధ్యక్షులు మల్లిఖార్జున ఖార్గే, ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్‌కు లేఖ రాయడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ జిల్లాలకు మంత్రి వర్గంలో ప్రాతినిధ్యం కల్పించడం వల్ల ప్రజలకు ప్రయోజనకరమే కాకుండా కాంగ్రెస్ పార్టీకి. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ఇది దోహద పడుతుందని లేఖలో పేర్కొన్నారు. జానారెడ్డి రాసిన లేఖ పార్టీలో చర్చనీయాంశంగా మారింది. ఉమ్మడి రంగారెడ్డిజిల్లాకు మంత్రివర్గంలో స్థానం కల్పించాల్సిన అవసరాన్ని ఆయన నొక్కిచెప్పడంతో మంత్రివర్గంలో స్థానం విషయంలో ఉమ్మడి జిల్లాకు అవకాశాలు కొంత మెరుగుపడ్డాయి. ఇదిలా ఉంటే గత ఎన్నికల్లో పాత ఉమ్మడి రంగారెడ్డిజిల్లాలోని 14 స్థానాల్లో నాలుగు చోట్ల కాంగ్రెస్ ఎమ్మెల్యేలు విజయం సాధించారు. ఇబ్రహీంపట్నం నుంచి మల్‌రెడ్డి రంగారెడ్డి, వికారాబాద్ నుంచి ప్రసాద్‌కుమార్, పరిగి నుంచి టి. రామ్మోహన్‌రెడ్డి, తాండూరు నుంచి మనోహర్‌రెడ్డి గెలుపొందారు. ఇందులో వికారాబాద్ స్థానం నుంచి గెలుపొందిన ప్రసాద్‌కుమార్‌కు స్పీకర్ స్థానం దక్కింది. కీలకమైన ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు మంత్రివర్గంలో స్థానం లేకపోవడం గతంలో కూడా ఎన్నడూ జరగలేదు. హైదరాబాద్‌లో అంతర్భాగంగా ఉన్న ఈ ప్రాంతం నుంచి ఒక్కరికి కూడా అవకాశం దక్కకపోవడంపై పార్టీలో అంతర్గతంగా కూడా విమర్శలు వస్తున్నాయి. దీంతో నలుగురు ఎమ్మెల్యేలు కలిసి తమలో ఎవరికైనా అవకాశం కల్పించాలని కోరుతూ పార్టీ పెద్దలను కలుస్తున్నారు. ఆదివారం ఎమ్మెల్యేలంతా పార్టీ ముఖ్యనేత జానారెడ్డిని కలిసి మద్దతు కోరారు. దీంతో ఆయన మంత్రివర్గ విస్తరణలో హైదరాబాద్, రంగారెడ్డిజిల్లాలకు ప్రాతినిధ్యం కల్పించాలని కోరుతూ అధిష్ఠానానికి లేఖ రాశారు. జానారెడ్డి హైదరాబాద్ జిల్లా కూడా ప్రస్తావించినప్పటికీ ఇక్కడ కాంగ్రెస్ నుంచి ఒక్క ఎమ్మెల్యే కూడా గెలవలేదు. దీంతో ఉమ్మడి రంగారెడ్డిజిల్లాకు కొంత అవకాశాలు ఉండచ్చని పార్టీ ముఖ్యనేతలు చెబుతున్నారు.

అంతటా ఆన్‌లైన్ చెల్లింపులే!

- గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా డిజిటల్ పేమెంట్లు
- సూపర్ మార్కెట్ నుంచి టీకొట్టు వరకూ క్యాష్‌లెస్ లావాదేవీలే!
- యాప్‌ల ద్వారా చెల్లింపులతో చిల్లర కష్టాల చెక్

చేవెళ్ల, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానం విస్తరించడంతో గ్రామాల్లోనూ డిజిటల్ లావాదేవీలు ఊపందుకున్నాయి. రోజురోజుకూ ఆన్‌లైన్ చెల్లింపులపై ప్రజలు ఆసక్తి కనబరుస్తున్నారు. డిజిటల్ ఇండియాగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నగదు రహిత లావాదేవీలు జోరందుకున్నాయి. మొదట్లో పట్టణాలకే పరిమితైన ఆన్‌లైన్ పేమెంట్లు ఇప్పుడు గ్రామాల్లో సాధారణమయ్యాయి. చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉండి, వాటిలో ఫోన్‌పే, గూగుల్‌పే, యోనో, పేటీఎం వంటి పేమెంట్ యాప్‌లు ఉంటే చాలు.. బ్యాక్ అకౌంట్ లింక్‌తో ఫోన్‌డేటా ఆన్‌చేసి డిజిటల్ పేమెంట్లు చేస్తున్నారు. బడ్డీ కొట్టుల్లో సింగిల్ టీ నుంచి మాల్స్ వరకూ, కూరగాయలు మొదలు జ్యువెలరీ షాపుల్లో నగల కొనుగోళ్ల వరకూ డిజిటల్ పేమెంట్లే ఎక్కువ. ఒక వేళ యూపీఐ(యాప్) లిమిట్ దాటితే నిఫ్ట్ తదితర బ్యాకింగ్ లావాదేవీలతో నగదు రహిత చెల్లింపులు చేస్తున్నారు. షాపుల వద్ద క్యూఆర్ కోడ్‌ల ద్వారా ద్వారా చెల్లింపులు చేస్తున్నారు. డిజిటల్ లావాదేవీలతో దుకాణాల్లో చిల్లర సమస్య తీరిందని వ్యాపారులు చెబుతున్నారు.



కిరాణాషాపులో డిజిటల్ పేమెంట్ చేస్తున్న వ్యక్తి

ఉధృతంగా డిజిటల్ చెల్లింపులు

కరోనాకు ముందు పట్టణాలకే పరిమితమైన ఆన్‌లైన్ చెల్లింపులు క్రమంగా గ్రామీణ ప్రాంతాలకూ విస్తరించాయి. ప్రస్తుతం ఎక్కడ చూసినా చిన్నచిన్న షాపుల్లోనూ క్యూఆర్ కోడ్ స్టిక్కర్లు కన్పిస్తున్నాయి. నగదు రహిత లావాదేవీ కావడం.. చిల్లర సమస్య లేకపోవడం, దొంగనోట్ల భయం లేకపోవడం తదితర కారణాలతో వినియోగదారులు, అమ్మకందారులూ ఈ డిజిటల్ లావాదేవీలకు మొగ్గు చూపుతున్నారు. కిరాణా షాపుల్లో, నిత్యావసర సరుకుల కొనుగోళ్లు, పెట్రోల్ బంకుల్లో, కేబుల్ రీచార్జ్, విద్యుత్/గ్యాస్ బిల్లులు తదితర వాటికి డిజిటల్ చెల్లింపులు చేస్తున్నారు. వారాంతపు సంతల్లోనూ ఆన్‌లైన్ పేమెంట్లు ఎక్కువే చేస్తున్నారు.

పేమెంట్లు సులభతరం

డిజిటల్ పేమెంట్లు అందుబాటులోకొచ్చిన తర్వాత చెల్లింపులు సులభతరమయ్యాయి. చిల్లర బెడద తప్పింది. బ్యాంకు అకౌంట్/ క్రిడిట్ కార్డు/ పేమెంట్ యాప్‌లో బ్యాలెన్స్ ఉంటే చాలు. చెల్లింపుల్లో జవాబుదారీ తనం ఉంది. వినియోగదారులకు, మాకు ఇది సౌకర్యవంతంగా ఉంది. అనవసర ఖర్చులు తగ్గాయి. క్యూఆర్ కోడ్ ఉపయోగించి చెల్లింపులు చేయడం ప్రతీ ఒక్కరికి తెలికే!



- కుంచం శ్రీనివాస్‌గుప్తా, కిరాణా షాపు వ్యాపారి, చేవెళ్ల

జాగ్రత్తలు తప్పనిసరి



డిజిటల్ చెల్లింపుల జాగ్రత్తలపై వినియోగదారులు అవగాహన పెంచుకోవాలి. సైబర్ నేరాలపై చైతన్యవంతం కావాలి. ట్రాన్సాక్షన్ పిన్/కోడ్ నంబర్లను ఎవరికీ చెప్పొద్దు. బ్యాంకు సిబ్బందని ఫోన్స్ వస్తే స్పందించొద్దు. బ్యాంక్ అకౌంట్లు, పేమెంట్ యాప్‌ల వివరాలను సీక్రెట్‌గా ఉంచాలి. పేమెంట్ల రిఫెరెన్స్ ఐడీ నంబర్లను కొన్ని రోజులు జాగ్రత్తపర్చుకోవాలి.

- శ్రీకాంత్‌రెడ్డి, ఎస్సై, చేవెళ్ల

ఎల్లమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

కోరిన కోర్కెలు తీర్చే మండలంలోని పోలెపల్లి ఎల్లమ్మ ఆలయానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. దుద్యాల, ఇతర ప్రాంతాల నుంచి భారీగా తరలొచ్చారు. అమ్మవారి దర్శనం కోసం గంటల తరబడి లైన్లో నిల్చున్నారు. దాదాపు 10వేల మంది భక్తులతో ఆలయం కిటకిటలాడింది. భక్తులు అమ్మవారిని దర్శించుకొని బోనం నైవేద్యం సమర్పించారు. మేకపోతులు, కోడి పుంజులు బలిచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

దుద్యాల, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి)



ఆలయానికి వస్తున్న భక్తులు



ఆర్థిక సాయం అందజేస్తున్న దశరథ్‌నాయక్

నిరుపేదలకు అండగా ఉంటాం

కడ్తాల్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): నిరుపేదలు, బాధిత కుటుంబాలకు జర్పుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ఎల్లవేళలా అండగా ఉంటుందని ట్రస్ట్ ఛైర్మన్, లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దశరథ్‌నాయక్ అన్నారు. ట్రస్ట్ సేవలను ప్రతీ గ్రామానికి విస్తరిస్తామని తెలిపారు. మంగళవారం పల్లెచెలుక తండాలో దశరథ్ పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి కృషిచేస్తానని తెలిపారు. తండాలో ఇటీవల మృతిచెందిన రాజు, శ్రీను, రాము, వెంకటయ్య కుటుంబాలను పరామర్శించారు. ట్రస్ట్ ద్వారా ఒక్కో కుటుంబానికి రూ.5వేల చొప్పున అందజేశారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని ఈ సందర్భంగా దశరథ్ కోరారు. కార్యక్రమంలో లోకేశ్ నాయక్, లాల్‌కోట నర్సింహగౌడ్, హరిచంద్, ప్రియరమేశ్, పాండు, శ్రీనునాయక్, జంగయ్య, బిచ్యానాయక్ తదితరులు ఉన్నారు.

భూముల విక్రయాన్ని వెనక్కి తీసుకోవాలి



మాట్లాడుతున్న డీఎంపీ జిల్లా అధ్యక్షుడు గట్యానాయక్

పరిగి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): హెచ్‌సీయూలో విద్యార్థులపై పోలీసులు అరాచకంగా వ్యవహరించడం అప్రజాస్వామికమని డీఎంపీ జిల్లా అధ్యక్షుడు గట్యానాయక్ అన్నారు. పరిగిలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. హెచ్‌సీయూ 400ఎకరాలను ప్రభుత్వం అమ్మకానికి తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. కాలుష్యం విషయంలో హైదరాబాద్‌ను మరో ఢిల్లీ చేస్తారా? అని ప్రశ్నించారు. ప్రజా పాలన పేరుతో ప్రజల భూములు అమ్ముకుంటారా? అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో ఆయా సంఘాల నాయకులు గోవింద్‌నాయక్, హరినాయక్, రవీందర్, బాబ్య తదితరులు పాల్గొన్నారు. ఇదే విధంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు మరో సమావేశాన్ని నిర్వహించి భూముల విక్రయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నకిలీ పత్రాలతో చేపడుతున్న నిర్మాణాలను నిలిపివేయాలి

కీసర రూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): నకిలీ పత్రాలతో చేపడుతున్న నిర్మాణాలను నిలిపివేయాలని బాధితులు కొన్నె అంజయ్య, శంకర్‌గౌడ్, హరిదాస్‌గౌడ్ మున్సిపల్ అధికారులకు విజ్ఞప్తి చేసారు. నాగారం మున్సిపాలిటీ, రాంపల్లి రెవెన్యూ సర్వేనంబర్లు 381-384, 387లలో వారికి జరుగుతున్న అన్యాయంపై మంగళవారం కీసరలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తమతో పాటు మరో 9మందికి 381-384, 387లలో 31.13 ఎకరాల భూమి వారసత్వంగా సంక్రమించిందని తెలిపారు. రియల్ ఎస్టేట్ వ్యాపారుల అండదండలతో కొందరు ఆస్థలంలో ప్రహరీ నిర్మిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేసారు. ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

మేడ్చల్‌కు నీటి గండం!

- మండుతున్న ఎండలు.. ఎండుతున్న బోర్లు
- నిండుకుంటున్న 800ఫీట్ల లోపు బోర్లు
- ఆందోళనలో పట్టణ ప్రజలు



నీటి సరఫరా సక్రమంగా లేదంటూ మున్సిపల్ కార్యాలయం ఎదుట స్థానికుల నిరసన(ఫైల్)



నీరు సరఫరా చేస్తున్న ట్యాంకర్

మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకు పెరుగుతున్న ఎండల కారణంగా భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి. కొద్దిరోజులుగా సరిపడా నీరందించిన బోర్లు ఒక్క సారిగా నిండుకుంటున్నాయి. గంటనడిచే బోరు ఐదు నిమిషాలు కూడా నడవక పోవటంతో ప్రజలకు నీటికష్టాలు తప్పడం లేదు. రానున్న రెండు నెలలు ఎండల తీవ్రత మరింత పెరగనుండటంతో ప్రజలకు సరిపడా నీరు సమకూర్చడం పాలకులకు సైతం కష్టతరంగా మారింది. ఇప్పటికే మేడ్చల్ ప్రాంతంలో 800ఫీట్ల లోపు వేసిన బోర్లు దాదాపు ఎండుముఖం పట్టాయి. ఫలితంగా ప్రజలు తమ అవసరాలు తీర్చుకోవడానికి ట్యాకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేస్తున్నారు. నగర శివారు ప్రాంతంలోని మేడ్చల్ ప్రజలు ప్రస్తుతం తాగునీటి సమస్యతో అల్లాడుతున్నారు. స్థానిక ప్రజల నీటి అవసరాలు తీర్చటానికి పాలకులు మిషన్ భగీరథ నీరు సరఫరా చేస్తునప్పటికీ ప్రజల అవసరాలు పూర్తి స్థాయిలో తీరడం లేదు. దినం తప్పి దినం సరఫరా చేస్తున్న నీరు కేవలం ఒక రోజుకు సరిపడని పరిస్థితి నెలకొంది. ఇప్పటికే స్థానికులు సరిపడా నీటిని సరఫరా చేయడం లేదంటూ మున్సిపల్ కార్యాలయాల వద్ద నిరసనలు చేపడుతున్నారు. అయినప్పటికీ గత్యంతరం లేక అధికారులు ప్రజలనే సర్దుకుపోవాలంటూ ఉచిత సలహాలు ఇచ్చి తప్పించుకుంటున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో స్థానికులు నీటి కష్టాలు తీర్చడం అధికారులకు ఒక సవాలుగా మారింది. మున్సిపల్ పరిధిలో వేసిన బోర్లు సైతం ఎండుముఖం పట్టడంతో ప్రైవేటు బోర్ల ద్వారా నీటి సరఫరా చేసేందుకు అధికారులు సిద్ధమవుతునప్పటికీ బోర్ల ద్వారా అనుకున్న మేరకు నీరు లభించడం లేదు. మున్సిపాలిటీల్లో వేసిన వందలాది బోర్లలో దాదాపు చాలావరకు ఎండిపోయినట్లు అధికారులు చెబుతున్నారు. భూగర్భజలాలు అడుగంటిన కారణంగా అనుకున్న మేరకు నీరందించలేకపోతున్నామని అధికారులు తెలిపారు.

ఇంటింటికీ ట్యాంకర్లు

మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని కేఎల్ఆర్ ఫేస్-1, ఫేస్-2, ఫేస్-3, రాఘవేంద్రనగర్, ఉమానగర్, ఆర్టీసీ కాలనీ, హౌజింగ్ బోర్డు కాలనీ , చంద్రానగర్, సూర్యనగర్, శాంతబయోటెక్ కలనీతో పాటు పట్టణంలో 1500 ఫీట్ల వరకు బోర్లు ఉన్నా చుక్కనీరు లభించని దయనీయ పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం నీరు సరఫరా చేసే ట్యాంకర్లకు డిమాండ్ పెరగటంతో రూ.800 ఉండే ట్యాంకర్‌కు రూ.1200 చెబుతున్నారని స్థానికులు అంటున్నారు.

సిబ్బంది లేకుండా నీటి సరఫరా



మున్సిపల్ పరిధిలో తాగునీటి కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే మిషన్ భగీరథ అధికారులతో సమావేశమై నీటిసరఫరా కోసం ప్రణాళికను రూపొందించాం. మున్సిపల్ పరిధిలో నీరందించే బోర్లను మరమ్మతు చేసి వాటిని వాడకంలోకి తీసుకొస్తున్నాం. ప్రస్తుతం ఆరు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నాం. భవిష్యత్తులో మరో 10ప్రైవేటు ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తాం. ఏప్రిల్, మే నెల గడిచేంత వరకు ప్రజలు నీటిని పొదుపుగా వాడాలి.

- నాగిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ మేడ్చల్

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మూడుచింతలపల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన ఘటన తుర్కపల్లిలోని జీనోమ్ వ్యాలీ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. సిద్దిపేట జిల్లా ములుగు మండలం మామిడ్యాల గ్రామానికి చెందిన ప్రవీణ్(23) హైదరాబాద్‌లో డెలవరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. రోజు వారిలాగే తన విధులు ముగించుకుని బైక్‌పై తిరిగి గ్రామానికి వస్తున్నాడు. ఈక్రమంలో మార్గమధ్యంలో రాజీవ్‌రహదారిపై తన సెల్‌ఫోన్ కిందపడిపోవడంతో బైక్‌ను పక్కకు ఆపి సెల్‌ఫోన్‌ను తీసుకుంటుండగా, అదే సమయంలో తుర్కపల్లి నుంచి ఎర్టీగా కారు అతివేగంగా వచ్చి ప్రవీణ్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ప్రవీణ్ తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రైలుకింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, అంకుశాపూర్‌కు చెందిన కొండల అశోక్‌యాదవ్(42) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం ఉదయం ఘట్‌కేసర్-బీబీనగర్ రైల్వేస్టేషన్‌ల మధ్య అంకుశాపూర్ సమీపంలోని 219/11 మైలురాయి వద్ద రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న రైల్వేపోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

వికారాబాద్‌లో దొంగల బీభత్సం

వికారాబాద్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో దొంగలు ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు. రెండిళ్లలో దొంగతనం చేయడంతో పాటు కత్తులతో ఇళ్ల మధ్య సంచరించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ ఘటన వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఆలస్యంగా వెలుగు చూసింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. వికారాబాద్ పట్టణం ఆలంపల్లి సినీమాక్స్ వెనుక గల్లీలో ఆదివారం రాత్రి రంజాన్ సందర్భంగా ఖదీర్ అనే వ్యక్తి తన సొంత గ్రామానికి కుటుంబంతో వెళ్లగా ఆ ఇంట్లో చొరబడిన దొంగలు 3తులాల బంగారం, 45 వేల నగదును దొంగలించారు. పక్కనే ఉన్న లెక్చరర్ నారాయణ నివాసంలో ఎవరూ లేక పోవడంతో ఆ ఇంట్లో కమ్ములు ఎత్తుకెళ్లారు. అదే రాత్రి అదే కాలనీలో కోమటి ప్రకాశ్ ఇంటి వరండాలో కత్తులతో తిరుగడం సీసీపుటేజీలో రికార్డయ్యాయి. ప్రస్తుతం ఆ సీసీ పుటేజీ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతుండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. దొంగలు కత్తులు పట్టుకుని తిరగడమేంటని జిల్లా కేంద్రంలో పోలీసు నిఘా వైఫల్యమే కారణమని పేర్కొంటున్నారు. ఈ విషయమై పోలీసులను ఫోన్‌లో సంప్రదించగా స్పందించలేదు.

పేదలను ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యం



శామీర్‌పేట్: పొన్నాల్‌లో సన్న బియ్యం పంపిణీని ప్రారంభిస్తున్న నక్క ప్రభాకర్‌గౌడ్

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పేద, బడుగుబలహీన వర్గాల ప్రజలను ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రతాప్‌సింగారంలో ప్రారంభించారు. మొదటి విడత మండలంలోని 28 రేషన్‌షాపుల్లో 19 వేల తెల్లరేషన్ లబ్ధిదారులకు 4 టన్నుల సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అవుశాపూర్‌లో జరిగిన సన్నబియ్యం పంపిణీ కార్యక్రమంలో కవాడి మాదవరెడ్డి, కందకట్ల సందీప్‌రెడ్డి, మేడబోయిన జంగయ్య ముదిరాజ్, మల్లికార్జున్‌రెడ్డి, భాస్కర్ గౌడ్, భానుప్రకాష్ పాల్గొన్నారు.

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని పలు రేషన్ దుకాణాలో మంగళవారం సన్నబియ్యం పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని, మున్సిపాలిటీ పార్టీ అధ్యక్షుడు ముత్యాలు, రాధాకృష్ణ, మహేష్, ఆంజనేయులు, ఎం.వెంకటేష్ పాల్గొన్నారు.

మూడుచింతలపల్లి: ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఏఎంసీ చైర్మన్ నర్సింహులుయాదవ్ అన్నారు. ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో భాగంగా ఉచిత సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం మండల వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగన్నాథం ఆధ్వర్యంలో లబ్ధిదారులకు ఉచిత సన్న బియ్యం పంపిణీ చేశారు.

మోమిన్‌పేట్: మండలంలోని మొరంగపల్లి, చిన్న కొల్కుంద గ్రామాల్లోని రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని మండల మాజీ ఎంపీపీ ఒగ్గు మల్లయ్య మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఐక్యవేదిక అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ కొనింటి సురేశ్, నాయకులు మానెయ్య, మల్లారెడ్డి, వెంకట్‌రెడ్డి, సంగమేశ్వర్ పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్: మండలంలోని సాలిండాపూర్ గ్రామంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశేఖర్‌రెడ్డి ప్రభుత్వం రేషన్ దుకాణాల్లో అందిస్తున్న సన్నబియ్యాన్ని లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

కీసర: సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం కీసర మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రామిడి విజయ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌శ్రేణులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

శామీర్‌పేట: మండలంలోని లాల్‌గడి మలక్‌పేట, పొన్నాల్‌లోని రేషన్ షాపుల్లో ముఖ్యఅతిథిగా రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు నక్క ప్రభాకర్‌గౌడ్ పాల్గొని సన్న బియ్యాన్ని పంపిణీని ప్రారంభించారు. అదేవిధంగా శామీర్‌పేట గ్రామంలోని రేషన్ షాపులో మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నాయకుడు కిశోర్‌యాదవ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వైఎస్‌గౌడ్ వినియోగదారులకు సన్న బియ్యాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గడ్డం రమేశ్, బత్తిని సత్యనారాయణ, మహేందర్‌యాదవ్, కృష్ణ, విమలమ్మ పాల్గొన్నారు.



ఘట్‌కేసర్ రూరల్: అవుశాపూర్‌లో లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎమ్మెల్యే మల్లారెడ్డిని కలిసిన పోచారం మున్సిపాలిటీ నాయకులు



ఎమ్మెల్యేను సత్కరిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు

ఘట్‌కేసర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డిని ఉగాది, రంజాన్ పండుగల సందర్భంగా పోచారం బీఆర్ఎస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శి శేఖర్, మాజీ వైస్‌చైర్మన్ రెడ్డియా నాయక్, కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్@ రూ.211 కోట్లు

(ఐదో పేజీ తరువాయి)

సద్వినియోగం చేసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. రాష్ట్రంలోనే మేడ్చల్ టాప్‌లో ఉన్నట్లు తెలిపారు.

మొత్తం లక్షా 65 వేల దరఖాస్తులు

జిల్లాలో లక్షా 65 వేల దరఖాస్తులు రాగా 28 వేల మంది దరఖాస్తుదారులు ఎల్ఆర్ఎస్ డబ్బులు చెల్లించి స్థలాలను క్రమబద్ధీకరించుకున్నారు. దీని ద్వారా జిల్లాకు రూ.211 కోట్ల ఆదాయం లభించింది. దాదాపు నెల రోజుల పాటు అధికారులు ఎల్ఆర్ఎస్‌పై విస్తృత ప్రచారం చేపట్టారు. మొదట్లో ఫీజు చెల్లించేందుకు దరఖాస్తుదారులు పెద్దగా ఆసక్తి చూపనప్పటికీ చివరి రెండు, మూడు రోజుల్లో పెద్ద ఎత్తున ఫీజులు చెల్లించారు. ఎల్ఆర్ఎస్ గడువు మరో వారం ఉందనగా దాదాపు ఏడు వేల మంది దరఖాస్తుదారులు మాత్రమే ఫీజులు చెల్లించారు. దీనికి తోడు ఎల్ఆర్ఎస్ యాప్‌లో సాంకేతిక ఇబ్బందులు తలెత్తడంతో ప్రక్రియ వేగవంతంగా ముందుకుసాగలేదు. మార్చి 31వ తేదీ వరకు 28 వేల మంది దరఖాస్తుదారులు ఫీజు చెల్లించారు.

సెలవుల్లోనూ పని చేసిన కార్యాలయాలు

ఆది, సోమవారాలు సెలవు రోజులైనా అధికారులు ఎల్ఆర్ఎస్ ప్రక్రియను కొనసాగించారు. ఎల్ఆర్ఎస్‌పై రాయితీని మరో నెల రోజుల పాటు పొడగిస్తే మరికొంత మంది దరఖాస్తుదారులు తమ స్థలాలను క్రమబద్ధీకరించుకునే అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. దీనిపై ప్రభుత్వ నిర్ణయం ఎలా ఉంటుందో వేచి చూడాలి. మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో ఎల్ఆర్ఎస్‌పై వచ్చిన ఆదాయంపై శ్రమించిన జిల్లా అధికార యంత్రాంగాన్ని బుధవారం కలెక్టర్ గౌతమ్, అదనపు కలెక్టర్ రాధికాగుప్తా అభినందిస్తారని అధికార వర్గాలు చెప్పారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి



మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

బొంరాస్‌పేట్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో అక్రమ ఇసుక, మైనింగ్ విచ్చలవిడిగా కొనసాగుతోందని, అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. వారు మండల కేంద్రంలో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. అక్రమ ఇసుక వ్యాపారం తహసీల్దార్, ఎస్ఐ కనుసన్నల్లో మూడు పువ్వులు, ఆరు కాయలుగా కొనసాగుతోందని ఆరోపించారు. రెండు ట్రాక్టర్ల ఇసుక రవాణాకు అనుమతి తీసుకొని 100 ట్రాక్టర్ల వరకు అక్రమంగా ఇతర ప్రాంతాలకు తరలిస్తూ, సొమ్ము చేసుకుంటున్నారన్నారు. ఇసుక దందాపై కలెక్టర్, ఎస్పీ పూర్తిస్థాయి విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో యం.వెంకటయ్య, బుస్స చంద్రయ్య, కొత్తూర్ చంద్రయ్య, యు.రమేశ్‌బాబు, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నాయకుల అరెస్టు



కొడంగల్ పోలీస్‌స్టేషన్‌లో అరెస్టయిన సీపీఐ నాయకులు

కొడంగల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ యూనివర్సిటీ భూములను కాపాలని ఏఐఎస్ఎఫ్ పిలుపు మేరకు హైదరాబాద్‌లో తలపెట్టిన నిరసన కార్యక్రమానికి వెళ్తున్న సీపీఐ నాయకులు పోలీసులు అరెస్టు చేశారు. కొడంగల్‌లో మంగళవారం సీపీఐ నాయకులు ఇందనూర్ బషీర్, శ్యామ్‌సుందర్‌లను పోలీసులు అరెస్టుచేసి స్టేషన్‌కు తరలించారు. అనంతరం సాయంత్రం సొంత పూచికత్తుపై వారిని పోలీసులు విడుదల చేశారు.

పరిగి: సెంట్రల్ యూనివర్సిటీ భూముల అమ్మకాన్ని నిరసిస్తూ చేపట్టిన ధర్నాకు తరలివెళ్లనున్న నాయకులు పరిగి పోలీసులు ముందుస్తుగా అరెస్ట్ చేశారు. మంగళవారం ఉదయమే సీపీఎం నాయకులు ఎం.వెంకటయ్య, హబీబ్, యాదగిరి తదితరులను వారి ఇళ్ల వద్దకు వెళ్లి అరెస్ట్ చేసి పరిగి స్టేషన్‌కు తరలించారు. మధ్యాహ్నం తర్వాత తిరిగి వదిలిపెట్టారు.

ఐబీపీఎస్ పరీక్షలో సత్తా చాటిన వికారాబాద్ యువతి



శిరీష

వికారాబాద్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఐబీపీఎస్ మార్కెటింగ్ ఆఫీసర్ పరీక్షల్లో వికారాబాద్ యువతి సత్తా చాటింది. వికారాబాద్ పట్టణం మధు కాలనీకి చెందిన శిరీష పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో స్పెషలిస్టు ఆఫీసర్‌గా ఎంపికైంది. శిరీష ఇప్పటికే ఆమెజాన్‌లో మార్కెటింగ్ విభాగంలో విధులు నిర్వహిస్తోంది. తల్లిదండ్రులు, భర్త ప్రోత్సాహం వల్లే తాను ఈ విజయం సాధించినట్లుగా శిరీష తెలిపింది.

పేదల కంచంలో సన్నన్నం

(ఐదో పేజీ తరువాయి)

అక్రమార్కులు దందా సాగించారు. బహిరంగ మార్కెట్లో కిలోకు రూ.12 నుంచి రూ.16 వరకు విక్రయించగా, రేషన్ డీలర్లు కొందరు కార్డుదారులకు బియ్యానికి బదులుగా కిలోకు రూ.10 వంతున డబ్బులు చెల్లించి ఆ బియ్యాన్ని వ్యాపారులు, హోటళ్లకు విక్రయించారు. పేదల దొడ్డుబియ్యం పక్కదారి పట్టడంపై ప్రభుత్వం క్షేత్రస్థాయిలో విచారించింది. దొడ్డు బియ్యానికి బదులుగా సన్నబియ్యం పంపిణీ చేస్తే ప్రజలు రేషన్ బియ్యాన్ని సద్వినియోగం చేసుకుంటారని ప్రభుత్వం భావించింది. రేషన్ బియ్యం అక్రమ రవాణాకు చెక్ పెట్టాలని సన్నబియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టింది.

నేడు కెరెల్లిలో ప్రారంభించనున్న స్పీకర్

జిల్లా వ్యాప్తంగా మంగళవారం సన్నబియ్యం పంపిణీ ప్రారంభించాల్సి ఉన్నా.. ముఖ్య ప్రజా ప్రతినిధులు స్థానికంగా అందుబాటులో లేకపోవడంతో బియ్యం పంపిణీ ప్రారంభించలేదు. మోమిన్‌పేట, బొంరాస్‌పేట మండలాల్లో మాత్రం రెండుచోట్ల సన్న బియ్యం పంపిణీ ప్రారంభమైంది. పరిగి, తాండూరు, చేవెళ్ల ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, కాలే యాదయ్య ఢిల్లీ పర్యటనలో ఉండడంతో ఆయా నియోజకవర్గాల్లో సన్నబియ్యం పంపిణీ ప్రారంభం కాలేదు. వారు ఢిల్లీ నుంచి వచ్చిన తర్వాతనే ఆ నియోజకవర్గాల్లో పంపిణీ షురూ అవుతుంది. బుధవారం ధారూరు మండలం కెరెల్లిలో స్పీకర్ ప్రసాద్‌కుమార్ సన్నబియ్యం పంపిణీని ప్రారంభించనున్నట్లు అధికారవర్గాలు తెలిపాయి.

ఐనాపూర్‌లో క్రికెట్ టోర్నమెంట్



గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేస్తున్న గోవర్ధన్

దోమ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఐనాపూర్ గ్రామంలో బోయిని అలియాస్ కిట్టు స్మారక క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. గ్రామ యువకుల ఆధ్వర్యంలో ఆర్గనైజర్స్ మహేశ్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్, దశరథ్‌లు క్రికెట్ పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రథమ బహుమతి రూ.10వేలు, ద్వితీయ బహుమతి రూ.5వేలు అందించారు. ఈ కార్యక్రమానికి హాజరైన బీసీ సంఘం మండల అధ్యక్షుడు గోవర్ధన్ ముదిరాజ్ చేతుల మీదుగా క్రీడాకారులు బహుమతులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో వెంకట్రాములు, సాయికుమార్, మేకల ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీజ్ చేసిన వాహనాలకు వేలం

మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) మేడ్చల్ ఎక్సైజ్ పరిధిలోని పలు ప్రాంతాల్లో అధికారులు సీజ్ చేసిన బైక్‌లకు వేలం నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ నవనీత తెలిపారు. ఆసక్తిగల వారు ఈనెల 2వ తేదీన సాయంత్రం 4 గంటలకు వేలంలో పాల్గొని వాహనాలను కొనవచ్చని తెలిపారు.

మారుతున్న గ్రామాల రూపురేఖలు



కులకచర్ల: సీసీరోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి

కులకచర్ల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): సీసీ రోడ్ల నిర్మాణంతో గ్రామాల రూపు రేఖలు మారుతున్నాయని డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి అన్నారు. కులకచర్లలో మంగళవారం ఉపాధిహామీ నిధులతో సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఆనంద్, మాజీ సర్పంచ్ వెంకటయ్యగౌడ్, స్థానికులు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

తాండూరు రూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఉద్దండాపూర్‌లో మంగళవారం సీసీరోడ్డు పనులు ప్రారంభించారు. ఎన్ఆర్ఈజీఎస్ రూ.10లక్షలతో గ్రామంలో సీసీరోడ్డు పనులను కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు గౌసొద్దీన్, లక్ష్మణ్‌గౌడ్, మాజీ సర్పంచ్ శివరాజ్‌లు పాల్గొని ప్రారంభించారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సహకారంతో ఎన్ఆర్ఈజీఎస్ కింద నిధులు మంజూరు చేయించడంతోనే గ్రామాల్లో సీసీ రోడ్డు పనులు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మహిబూబ్, అబ్దుల్ రహీం, అంజనేయులు, అంబాదాస్, కుర్వ గోపాల్, సికిందర్ పాల్గొన్నారు.

పూడూరు: చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి నిధులతో మండలంలోని గొంగుపల్లిలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యులు, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మల్లేష్ పటేల్, బీజేపీ మండల అధ్యక్షుడు తుంపల్లి రాఘవేందర్ మంగళవారం సీసీరోడ్డు పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు వెంకటయ్య, మండల ఉపాధ్యక్షుడు కృష్ణాచారి, సత్యయ్య, పూడూరు, గొంగుపల్లి బూత్ అధ్యక్షులు సుభాన్, బూత్ అధ్యక్షుడు మహేష్, శ్రీహరి, రాజు, నాయకులు పాల్గొన్నారు.

రేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద అన్నదానం

శామీర్‌పేట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం భక్తులకు మంగళవారం అన్నదానం ఏర్పాటు చేశారు. బోనాలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద శామీర్‌పేటకు చెందిన బత్తిని ఈశ్వర్‌గౌడ్ జ్ఞాపకార్థం ఆయన కుమారులు బత్తిని వెంకటేశ్‌గౌడ్, బత్తిని శ్రీనివాస్‌గౌడ్, బత్తిని మల్లేశ్‌గౌడ్, వారి కుటుంబ సభ్యులు అన్నదానం చేపట్టారు.



అన్నదానంలో పాల్గొన్న భక్తులు

డీసీఎంఎస్ తాండూరు ఇన్‌చార్జి మేనేజర్‌గా సలాం



సలాం

తాండూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): డీసీఎంఎస్ తాండూరు బ్రాంచ్ ఇన్‌చార్జి మేనేజర్‌గా సలాం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ మేనేజర్‌గా పని చేసిన ఎల్లయ్య వికారాబాద్ డీసీఎంఎస్ మేనేజర్‌గా బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా సలాం మాట్లాడుతూ.. డీసీఎంఎస్ తాండూరు బ్రాంచ్‌కు పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు.

దొడ్డి కొమురయ్య జయంతిని జయప్రదం చేయాలి

తాండూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): చలో తాండూరు పేరిట గురువారం(రేపు) నిర్వహించే దొడ్డి కొమురయ్య 98వ జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని తాండూరు డివిజన్ కురవ సంఘం మంగళవారం బీరప్ప ఆలయంలో ప్రత్యేక సమావేశమై కార్యక్రమాల గురించి చర్చించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ యశోదనగర్ పార్కు దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి జయంతి ఉత్సవాలు ఘనంగా జరపాలని నిర్ణయించారు. మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేసే కార్యక్రమంలో అత్యధిక సంఖ్యలో కురుమ సోదరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.